క్లుప్తంగా

ఎమ్మెల్యే పల్లాకు పరామర్శ



ఎమ్మెల్యే పల్లాను పరామర్శిస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మండలానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు కాలికి గాయమై శస్త్ర చికిత్స జరిగిన నేపథ్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ మెరుగు కృష్ణ, పూడెం గోపాల్‌రెడ్డి, అత్కూరి జయరాములు, దుర్గారెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

300 మందికి వైద్యపరీక్షలు



మందులు అందజేస్తున్న వంశీధర్‌రెడ్డి

కోహెడ(హుస్నాబాద్): స్థానిక హైస్కూల్ ఆవరణలో గవ్వ కమలమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కరీంనగర్‌కు చెందిన కెల్విన్ ఆస్పత్రి వైద్యులు సురేశ్‌కుమార్, ప్రశాంత్ నాయక్, దివ్య, లిఖిత సుమారు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. 176 మందికి ఉచితంగా మందులు అందజేశారు. మండల వ్యాప్తంగా గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు వంశీధర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కిషన్ రెడ్డి, శ్రీనివాస్, వీరస్వామి, లక్ష్మారెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి పూర్తయ్యేది ఎప్పుడు?



మాట్లాడుతున్న అశోక్

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు గ్రామ శివారులో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను ఎప్పుడు పూర్తి చేస్తారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ ప్రశ్నించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ రూ.2.80 కోట్ల వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు 80 శాతమే పూర్తయ్యాయని, కాంట్రాక్టర్, అధికారుల నిర్లక్ష్యం సరికాదన్నారు. వర్షాకాలం వాహనదారులు ఇబ్బంది పడే అవకాశం ఉందని, వెంటనే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు భాస్కర్‌రెడ్డి, కనకయ్య, శ్రీనివాస్‌రెడ్డి, కిష్టయ్య, ఎల్లయ్య తదితరులున్నారు.

పైపులైను నిర్మాణం పూర్తి చేయాలని వినతి



శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న రైతులు

తొగుట(దుబ్బాక): పెండింగ్‌లో ఉన్న మల్లన్నసాగర్ లిఫ్టిరిగేషన్ పైపులైను పూర్తిచేసి పంటలకు సాగునీరు అందించాలని మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన రైతులు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి ఆదివారం తొగుటలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయించేలా చొరవ తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, స్వామి, కొండల్‌రెడ్డి, ఎల్లం, కనకయ్య, మహిపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, పోచయ్య, భూపాల్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మంత్రులకు నాయకుల ఘన స్వాగతం

బెజ్జంకి(సిద్దిపేట): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా మొదటిసారి కరీంనగర్‌కు వెళ్తున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆదివారం బెజ్జంకి క్రాసింగ్ వద్ద గల రాజీవ్ రహదారిపైన మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. నాయకులు దామోదర్, శ్రీనాథ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్, రత్నాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులులేక.. ట్రాక్టర్లు రాక..

గ్రామాల్లో ఆగిన చెత్త సేకరణ
- కంపుకొడుతున్న కాలనీలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కార్యదర్శులపై అదనపు పనిభారం




మర్కూక్‌లో నిలిచిపోయిన చెత్త సేకరణ ట్రాక్టర్, (ఇన్‌సెట్) చేబర్తిలో ఇళ్ల ఎదుట పేరుకుపోయిన చెత్త

మర్కూక్(గజ్వేల్): గ్రామాల్లోకి చెత్త సేకరించే ట్రాక్టర్‌లు రాకపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో చెత్త సేకరణ కోసం పంచాయతీ ద్వారా ఒక్కొక్క ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసింది. అవి తడి, పొడిచెత్తను సేకరించి డంపింగ్ యార్డులలో వేసేందుకు వినియోగపడేవి.

చేతులెత్తేసిన కార్యదర్శులు

అయితే సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ఆ బాధ్యతలను గ్రామ కార్యదర్శులకు అప్పగించారు. పంచాయతీలకు నిధులు రాకపోవడంతో కార్యదర్శులు తమ సొంత డబ్బులతో పనులు చేయించారు. అయితే నిధులు లేక గ్రామ కార్యదర్శులు చేతులెత్తేశారు. దీంతో కొన్ని రోజుల నుంచి గ్రామాలలో చెత్త సేకరణ ట్రాక్టర్‌లు నిలిచిపోయాయి.

ప్రజల ఇబ్బందులు

నిధుల లేమితో మండంలోని చేబర్తి, మర్కూక్, ఇప్పలగూడెం తదితర గ్రామాలకు చెత్త సేకరణ ట్రాక్టర్‌లు రాకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయింది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. రోజుల తరబడి ట్రాక్టర్‌లు రాకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించుకునే పాపాన పోలేదని వాపోతున్నారు.

డీజిల్ కోసం డబ్బులు లేక..

గ్రామాలలో తడి, పొడిచెత్తను సేకరించే ట్రాక్టర్‌లకు డీజిల్ కోసం డబ్బులు లేకపోవడంతో చెత్త సేకరణ నిలిచిపోయింది. అధికారులు తమ సొంత డబ్బులు ఖర్చు చేయలేక చేతులెత్తేశారు. కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు ఆగిపోవడంవల్ల ట్రాక్టర్‌లు పంపించలేని స్థితిలో ఉన్నామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

రోడ్లపైనే చెత్త వేస్తున్నారు



పది రోజుల నుంచి చెత్త సేకరణకు ట్రాక్టర్ రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కొంతమంది రోడ్ల మీదనే పారబోస్తున్నారు. తడి, పొడిచెత్త ఇళ్ల వద్ద రోజుల తరబడి ఉండడంతో దర్గంధం వెదజల్లుతోంది. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. రోగాల బారిన పడే అవకాశం ఉంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడంలేదు. వెంటనే చెత్త ట్రాక్టర్‌ను పంపించాలి.

– కొండ నర్సమ్మ, చేబర్తి

అధికారుల దృష్టికి తీసుకెళ్తా..

గ్రామాలలో చెత్తసేకరణ కోసం ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో సంబంధిత గ్రామ కార్యదర్శులు తమ సొంత డబ్బులు ఖర్చుచేసి గ్రామాలలో పనులు చేయించారు. ఆ బిల్లులు రాకపోవడంతో చెత్త సేకరణ ట్రాక్టర్లకు డీజిల్ పోయించలేకపోతున్నారు. మండలంలోని కొన్ని గ్రామాలలో చెత్త సేకరణ ట్రాక్టర్‌లు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవమే. అధికారుల దృష్టికి తీసుకెళ్తా. సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తా.

– అశోక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ



మర్పడ్గలో అవగాహన కల్పిస్తున్న శంకర్

గ్రామాభివృద్ధికే అధిక ప్రాధాన్యం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్

కొండపాక(గజ్వేల్): కేంద్ర ప్రభుత్వం గ్రామాభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యమిస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. 11 యేళ్ల బీజేపీ పాలనను పూర్తి చేసుకున్న సందర్భంగా మండల పరిధిలోని మర్పడ్గ గ్రామంలో ఆదివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, రేషన్ బియ్యం పంపిణీ, వ్యవసాయ పరికరాలు, పనిముట్లపై సబ్సిడీలు, పల్లె ప్రకృతి వనాల కోసం కేంద్ర ప్రభుత్వం అందించిన నిధుల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బీజేపీ రెండో మారు అధికారంలోకి వచ్చాక గ్రామాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను సైతం రాష్ట్ర ప్రభుత్వమే అమలు చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఒకేసారి 3 నెలలకు సన్నరకం రేషన్ బియ్యాన్ని అందజేస్తుందని చెప్పారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు కేంద్ర ప్రభుత్వ వాటా ఉందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నీల సత్యం, నర్సింహులు, నారాయణరెడ్డి, ప్రశాంత్, మల్లేశం, యాదవరెడ్డి, చంద్రం, ఆంజనేయులు, సాగర్, అనిల్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన రేపు

మిరుదొడ్డి(దుబ్బాక): సిద్దిపేట జిల్లాలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మంగళవారం పర్యటించనున్నట్లు డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, జిల్లా అధ్యక్షుడు భీమ్‌శేఖర్ తెలిపారు. మిరుదొడ్డిలో ఆదివారం వారు మాట్లాడుతూ 24న ఉదయం 10.30కు కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అట్రాసిటీ, ఎస్సీ, ఎస్టీ సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. బాధితులు తమ సమస్యల పరిష్కారం కోసం ఫిర్యాదులు చేసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీఆర్సీ అమలయ్యేలా కృషి



ఏసురాజు దంపతులకు సన్మానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయులకు పీఆర్సీ అమలయ్యే విధంగా పీఆర్టీయూ కృషి చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా పీఆర్టీయూ నాయకుడు ఏసురాజు ఉపాధ్యాయ పదవివిరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏసురాజు 25 సంవత్సరాలుగా అందించిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదలయ్యేటట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, శశిధర్‌శర్మ, విజయ, సురేందర్ రెడ్డి, బాపు రెడ్డి, సుజాత, రమాదేవి, అనిల్ కుమార్, ఆస లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు

మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యత

2కే రన్‌లో సీఐ శ్రీను



2కే రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, యువత

చేర్యాల(సిద్దిపేట): మాదకద్రవ్యాల నివారణ అందరి బాధ్యత అని సీఐ ఎల్.శ్రీను అన్నారు. యాంటీ డ్రగ్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి పోలీస్‌స్టేషన్ వరకు 2కే రన్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం స్టేషన్ ఎదుట మానవ హారం చేపట్టారు. విద్యార్థులు, యువతీయువకుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిత్యం గమనించాలని సూచించారు. చెడు మార్గాల వైపు ఆకర్షితులై జీవితాలు నాశనం చేసుకోవద్దని, అలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ నీరేశ్, సిద్దిపేట రన్నర్ అసోసియేషన్ సభ్యులు, సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ నర్సింహాచారి, విద్యార్థులు, యువకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

సిద్దిపేటకమాన్/సిద్దిపేటఅర్బన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, త్రీటౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. యాంటీ డ్రగ్స్ అవేర్‌నెస్ వీక్‌లో భాగంగా సిద్దిపేట, రంగధాంపల్లిలోను వారు ఆదివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మత్తు పదార్థాలు వాడడం వల్ల కలిగే నష్టాలు, దుష్ప్రభావాల గురించి వివరించారు. కార్యక్రమాలలో ఏఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుల్ అమృత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నీటి సరఫరాలో అంతరాయం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య ఆదివారం తెలిపారు. కొండపాక పంపింగ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కోమటిబండ నుంచి నీటి సరఫరా తగ్గిందని, దీంతో మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని వార్డులలో నీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

భవిష్యత్ పోరాటాలకు సిద్ధం

ఎమ్మార్పీఎస్ నేత మందకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంద కుమార్

జగదేవ్‌పూర్(గజ్వేల్): భవిష్యత్ పోరాటాలకు ఎమ్మార్పీఎస్ సిద్ధంగా ఉందని, అణగారిన వర్గాల సమస్యలపై పోరాడతామని జిల్లా ఇన్‌చార్జి, ఎంఎస్పీ జాతీయ నాయకుడు మంద కుమార్ అన్నారు. మండలంలోని కొండపోచమ్మ ఆవరణలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. మంద కృష్ణమాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని, అణగారిన వర్గాల సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రాజు, ఉపాధ్యక్షుడు సురేందర్, కరుణాకర్, స్వామి, యాదగిరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గద్దె నిర్మాణానికి భూమిపూజ

కొండపాక(గజ్వేల్): మండలంలోని మేదినీపూర్ ఎస్సీ కాలనీలో దండోరా గద్దె నిర్మాణానికి మందకుమార్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామానా దండోరా జెండాలను ఆవిష్కరించాలన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ బలోపేతం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. మండల అధ్యక్షుడు కిషన్, నాయకులు రాజు, మల్లేశం, కనకయ్య, సంపత్, మధు, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లన్నకు రూ.15 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న రామన్ దేవిక దంపతులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో 100 గదుల నిర్మాణానికి హైదరాబాదుకు చెందిన భక్తులు డాక్టర్ రామన్ దేవిక దంపతులు ఆదివారం ఆలయ ఈఓ అన్నపూర్ణకు రూ.15 లక్షలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ స్వామివారిని 45 యేళ్ల నుంచి ప్రతియేటా దర్శించుకుంటున్నామని, ఆలయ పరిసరాలలో వసతిగది కోసం విరాళం అందజేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, అర్చకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల చేయూత

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక ఉన్నత పాఠశాలలో 1991–92బ్యాచ్ పదో తరగతికి చెందిన భూపాల్ ఇటీవల మృతి చెందగా తోటి స్నేహితులు ఆదివారం తోర్నాల గ్రామంలోని ఆ కుటుంబాన్ని పరామర్శించి, రూ.17,500 సాయం అందజేశారు. కనకయ్య, అమీర్ అలీ, శంకర్, రామచంద్రం, సతీశ్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

హుస్నాబాద్‌రూరల్: మండల పరిధిలోని పొట్లపల్లి రాజేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం స్వామివారి కల్యాణం నిర్వహించడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. చివరి రోజు అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ కిషన్‌రావు, అర్చకులు వాసుదేవ శర్మ, సతీశ్, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

వర్షాలు కురవాలి.. పంటలు పండాలి..



రోకలికి కట్టిన కప్పపై నీళ్లు పోస్తున్న మహిళ

చేర్యాల(సిద్దిపేట): వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా వర్షాలు కురవకపోవడంతో మండలంలోని రాంగపూర్ గ్రామంలో చిన్నారులు వర్షాలు కురవాలి... పంటలు బాగా పండాలి వాన దేవుడా.. అంటూ పాటలు పాడుతూ కప్పతల్లి ఆటలు ఆడారు. ఆదివారం చిన్నారులు అంతా కలిసి రోకలి బండను అలకరించి మధ్యలో ఉంచిన సంచిలో కప్పను కట్టి కోలాటాలు ఆడుతూ ఇంటింటికీ తిరిగారు. మహిళలు హారతి పట్టి కప్పతల్లి, చిన్నారులపై బిందెలతో నీళ్లపోసి వాన దేవుడు కరుణించాలని వేడుకున్నారు. పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ కప్పతల్లి ఆటలు ఆడితే వాన దేవుడు కరుణించేవాడని, వానలు కురిసేవన్నారు. ఈ యేడు సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. చిన్నారులు మనోజ్, చరణ్, సాయినాథ్, సంజయ్, ప్రవీణ్, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

30న యాదవుల ఆత్మ గౌరవసభ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుస్నాబాద్: హైదరాబాద్‌లోని ఇందిరాపార్కులో 30న నిర్వహించనున్న యాదవుల ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ పిలుపునిచ్చారు. పట్టణంలో సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం యాదవులకు నామినేటెడ్ పదవులను కల్పించాలన్నారు. కార్పొరేషన్‌కు రూ.10వేల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో అయిలేష్, రమేశ్, రవికుమార్, ప్రసాద్, జంపయ్య, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు



బస్వాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

చేర్యాల(సిద్దిపేట): స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో 1998–1999 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 25 యేళ్ల తర్వాత కలుసుకున్న వారందరూ పాఠశాలలో సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని, చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో ఆనాటి గురువులు రఘుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరమణ, రాంచంద్రారెడ్డి, వెంకటాద్రి, స్వరూప, మేఘ మాల, హరిరాములు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

బస్వాపూర్‌లో..

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుకునే రోజులను గుర్తుచేసుకుని సందడి చేశారు. అనంతరం అప్పుడు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పద్మయ్య, హనుమంత్‌రెడ్డి, దేవేందర్, శ్రీనివాస్‌గౌడ్, సత్తయ్య, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.